క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ ఎలా?

- గురువారం నుంచి ఎన్‌సీడీ 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం
- క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స ఇవ్వటం లక్ష్యం

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14 నుంచి నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారానికి 45 గృహాలను సందర్శించి వారికి ఉచితంగా పరీక్షలు చేయాల్సి ఉంది. ఇంట్లో 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక జబ్బులతో పాటుగా నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయాలి. రొమ్ము క్యాన్సర్ అనుమానం ఉంటే నిర్ధారణ కోసం గుంటూరు జీజీహెచ్‌లోని నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు పంపించి మామోగ్రామ్ పరీక్ష చేయించాల్సి ఉంది. అయితే నెలరోజులకు పైగా నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో మామోగ్రామ్ వైద్య పరికరం పనిచేయటం లేదు. జీజీహెచ్ రేడియాలజీ వైద్య విభాగంలో మరో మెషిన్ ఉన్నా కూడా అది కూడా పనిచేయటం లేదు. ప్రైవేటు సెంటర్స్‌లో సుమారు రెండు వేల వరకు మామెగ్రామ్ పరీక్షకు ఫీజు తీసుకుంటున్నారు. దీంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం వచ్చే వారు ప్రైవేటు స్కానింగ్ సెంటర్స్‌కు వెళ్లి డబ్బులు చెల్లించి వైద్య పరీక్ష చేయించుకోవాల్సి వస్తుంది.


రిపేరుకు గురైన రొమ్ముక్యాన్సర్ పరీక్ష చేసే మామోగ్రామ్ మిషన్

రిపేర్లు చేయాల్సిన సంస్థ ఏం చేస్తుంది?

గుంటూరు జీజీహెచ్‌తో పాటుగా పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరికరాలు మరమ్మతులకు గురైతే బెంగళూరుకు చెందిన సైరెక్స్ సంస్థ రిపేర్లు చేయాల్సి ఉంది. రిపేర్లు చేయటానికి ఆలస్యమైతే అప్పటి వరకు ఏదైనా వైద్య పరికరాన్ని వారు అందుబాటులో పెట్టి వైద్యసేవలు ఇబ్బంది లేకుండా చూడాల్సి ఉంది. అయినా సైరెక్స్ సంస్థ వారు ఎలాంటి ప్రత్యామ్నాయ వైద్య పరికరాలు అందుబాటులో పెట్టకుండా పాడైన దానికి రిపేర్లు చేయకుండా జాప్యం చేయటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయాలనే లక్ష్యంగా చేస్తున్న ఎన్‌సీడీ 3.0 కార్యక్రమానికి ఈ సంస్థ పనితీరువల్ల తూట్లు పొడుస్తున్నట్లు అని పిస్తోంది.

మరమ్మతులకు గురైన మామోగ్రామ్ మిషన్

బాధితుల వివరాలు..

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 2022లో ప్రపంచ వ్యాప్తంగా 2.3 మిలియన్ల మంది రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. 2022లో ప్రపంచ వ్యాప్తంగా 6.70 లక్షల మంది రొమ్ము క్యాన్సర్‌తో చనిపోయినట్లు వెల్లడించారు. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒకరు ఈ వ్యాధికి బలవుతున్నారు. భారత దేశంలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు.

మామోగ్రామ్ పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు ...

జీజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణపరీక్ష మామోగ్రామ్ 2017లో 321 మంది, 2018లో 123 మంది, 2019లో 217 మంది, 2020లో 13 మంది, 2021లో 35 మంది, 2022లో 100 మంది, 2023లో 558 మంది, 2024 సెప్టెంబరు వరకు 184 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరికరం రిపేరుకు గురవ్వటంతో నెలకు పైగా పరీక్షలు చేయటం లేదు.

మామోగ్రామ్‌తో తొలిదశలోనే గుర్తించవచ్చు



తొలి దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు మామోగ్రామ్ పరీక్ష చేస్తారు. పరీక్షతో రెండు మిల్లీమీటర్ల కన్నా తక్కువ సైజులో రొమ్ములో గడ్డలు ఉన్నా గుర్తించి వెంటనే వైద్యం చేయవచ్చు. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే వ్యాధి నుంచి త్వరితగతిన కోలుకోవటంతోపాటుగా మరణాన్ని తప్పించవచ్చు. మహిళలే స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకుని రొమ్ములో ఏమైనా గడ్డలు ఉన్నట్లు అనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ప్రతిభా పాటవ పోటీల్లో విజేతలుగా నిలిచిన మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శుక్రవారం లక్ష్మీపురంలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎల్ఐసీ అమరావతి రోడ్డు బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ డీవీ కోటేశ్వరరావు, వీవీఎస్ యామినీదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్, కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ పాల్గొన్నారు.

వైభవంగా హోమాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వస్థానం ఆవరణలోని యాగశాలలో కార్తిక పౌర్ణమి సందర్భంగా అశేష భక్తి ప్రపత్తుల నడుమ జ్వాలాతోరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీభారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు బోల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, లంకా విజయబాబు, డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, నూతలపాటి తిరుపతయ్య, పాటిబండ్ల విష్ణువర్ధన్ దంపతులు పాల్గొన్నారు.

లాడ్జిల్లో పోలీసుల సోదాలు



పట్నంబజారు: గుంటూరు నగరంలో లాడ్జిల్లో పోలీసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పలు లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు అరండల్‌పేట, కొత్తపేట, లాలాపేట, పోలీసు స్టేషన్‌ల పరిధిలోని పలు లాడ్జిల్లో ఆయా స్టేషన్‌ల అధికారులు, సిబ్బంది సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఎవరెవరు వస్తున్నారు. వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. లాడ్జిల యజమానులు వచ్చే కస్టమర్ల వివరాలు తీసుకోవాలని, గుర్తింపు కార్డులు సేకరించాలని, లాడ్జిలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. అధికంగా లాడ్జిలకు వచ్చి ఘర్షణకు పాల్పడేవారు, ఇతర అనుమానిత వ్యక్తులు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి ఆశ్రయం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



కొరిటిపాడు: చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది పేద విద్యార్థులకు రూ.10 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ శుక్రవారం తెలిపారు. ఆదివారం నరసాపురంలోని గన్నాబత్తుల పెద్దతాత తులసమ్మ తెలగా కళ్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్– గుంటూరు, రాయల్ క్లబ్–నరసాపురం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రూ.2 లక్షలు తులసి సీడ్స్ కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యి వితరణ చేయనున్నట్లు తెలిపారు.

18 నుంచి లాడ్జిసెంటర్‌లో ఆక్రమణల తొలగింపు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని లాడ్జి సెంటర్ నుంచి కొరిటిపాడు, విద్యా నగర్ నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు ఫుట్ పాత్, రోడ్, డ్రెయిన్ ఆక్రమణలను ఈ నెల 18 నుంచి తొలగిస్తామని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకొని నగరపాలక సంస్థకు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, డ్రెయిన్ల మీద ఆక్రమణల వలన పూడిక తీయడటానికి వీలు లేక, మురుగుపారుదలకు ఆటంకంగా ఉండడం వలన అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికే దశల వారీగా ఓల్డ్ క్లబ్ రోడ్, జీటీ రోడ్, జీజీహెచ్ పరిసరాలు, అదే క్రమంలో అమరావతి రోడ్‌లో ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు.

జీవనశైలి మార్పులతో మధుమేహం అదుపు సాధ్యం

లక్ష్మీపురం: జీవనశైలిలో మార్పుతో మధుమేహాన్ని సులువుగా అదుపులో పెట్టుకోవచ్చని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం 'వరల్డ్ డయాబెటిస్ డే' నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఆధునిక జీవన శైలి వలన షుగర్ వ్యాధి బారిన పడుతున్నారు. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే మిగతా వారు కూడా వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర ప్రసంగించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అన్యాయం

లక్ష్మీపురం: వినియోగదారులకు సమాచారం లేకుండా నగరంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం అన్యాయమని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజావలి పేర్కొన్నారు. ఏటీ అగ్రహారంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ డిజిటల్ మీటర్లకు బదులు కూటమి ప్రభుత్వం అదాని స్మార్ట్ మీటర్లను వినియోగంలోకి తెస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం వినియోగదారుల సంఘాలతో కూడా ప్రభుత్వ అధికారులు, విద్యుత్ అధికారులు ఎటువంటి సమావేశం నిర్వహించలేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రీ పెయిడ్ విద్యుత్ వ్యవస్థను అదాని కనుసన్నల్లో ఏర్పరిచేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

పశుపతి నాథునిగా దర్శనమిచ్చిన మల్లికార్జున స్వామి


జ్వాలా తోరణం

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జున పేటలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారు పశుపతినాథునిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం జ్వాలా తోరణం, కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.


పశుపతి నాథునిగా స్వామివారి దర్శనం

అవోపా ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం


కోటి దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరువారితోటలోని రాధాకృష్ణగోశాలలో శుక్రవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గోవులను శుభ్ర చేసిన మహిళలు పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం కార్తిక దీపాలు వెలిగించారు. మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, చామర్తి రమేష్, విజయ, పూర్ణేశ్వరి, సునీత, కోటి రత్నం పాల్గొన్నారు.


దీపాలతో.. వైభవంగా కార్తిక దీపోత్సవం

నగరంపాలెం: కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లాలాపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దేవస్థానంతోపాటు కొత్తపేట శ్రీ జగన్నాథ స్వామివారి దేవస్థానంలో, నాజ్ సెంటర్‌లోని శ్రీఆంజనేయస్వామివారి దేవస్థానం ఆవరణలో కార్తిక దీపోత్సవం జరిగింది.

లీకులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

నగర మేయర్ మనోహర్ నాయుడు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర మేజర్ పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు సూచించారు. సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద లీకు మరమ్మతులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు తాగునీటి సరఫరా జరిగే పైప్ లైన్‌పై సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఏర్పడిన లీకు వలన గుంటూరు నగరంలో అధిక ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని చెప్పారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ లీకు మరమ్మతులు 36 గంటల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జరగాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల వేగవంతం చేసేందుకు అదనంగా ఇంజినీరింగ్ అధికారులకు విధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. లీకు పనులను ఇంజినీరింగ్ అధికారులు దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలని, రాత్రి సమయంలో పనులు జరగడానికి వీలుగా లైట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. నగరంలో తక్కెళ్లపాడు పంపింగ్ లైన్ నుంచి తాగునీటి సరఫరా జరిగే హెచ్ఎల్ఆర్, గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, వికాస్ నగర్, ఏటి అగ్రహారం, కోర్ట్ కాంపౌండ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఏఎంసీ, కేవీపీ కాలనీ రిజర్వాయర్ల పరిధిలోనే తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, సంగం జాగర్లమూడి నుంచి పంపింగ్ జరిగే మిగిలిన ప్రాంతాల్లో యథావిధిగా సరఫరా జరుగుతుందని వివరించారు. పర్యటనలో ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన తరువాతే బిల్లుల చెల్లింపు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తర్వాతనే బిల్లుల చెల్లింపు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసి, బిల్లుల చెల్లింపు కోసం ప్రత్యక్ష పరిశీలన కోసం అరండల్ పేట, ద్వారకా నగర్, అన్నపూర్ణ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు దగ్గరుండి పనులు పరిశీలించాలన్నారు. చేపట్టిన పనులు నిర్దేశిత గడువుకు ముందే డ్యామేజి జరిగితే సంబంధిత కాంట్రాక్టర్, పర్యవేక్షణ చేసిన ఇంజినీరింగ్ అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. అనంతరం అరండల్ పేట 17వ లైన్‌లో నివాస అవసరాలకు వినియోగించాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్‌ని వాణిజ్య అవసరాలైన హోటల్స్, టిఫిన్ బండ్లు వినియోగించడం గమనించి, స్థానిక తహసీల్దార్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సదరు ప్రాంతంలో టిఫిన్ బండ్లు డ్రెయిన్ మీద, రోడ్ల మీద ఆక్రమణ చేసి ఏర్పాటు చేసుకున్నారని, ఆయా బండ్లను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ శ్రీవల్లి, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఏసీపీ మల్లికార్జున, డీఈఈలు నాగభూషణం, రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఐజాక్, ప్రసాద్ పాల్గొన్నారు.


నాణ్యత పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

హౌస్ హోల్డ్ సర్వే వేగంగా చేపట్టాలి

గుంటూరు నగరంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వే వేగవంతం చేయాలని, సర్వే కోసం ఇంటికి వచ్చే సచివాలయ కారయదర్శులకు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం నగరంలో వార్డ్ సచివాలయ కార్యదర్శులు చేస్తున్న సర్వేలను కమిషనర్ బ్రాడిపేట, విద్యా నగర్ లోని పలు ప్రాంతాల్లో నేరుగా పరిశీలించి, జియో ట్యాగ్, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అప్ లోడ్ వేగవంతంపై తగు ఆదేశాలు జారీ చేశారు.

మధుమేహంతో ముఖ్యమైన అవయవాలకు చేటు

డాక్టర్ శ్రీహరికృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోలేని పక్షంలో శరీరంలోని ముఖ్యమైన అవయవాలకు ప్రమాదకరంగా మారుతుందని శ్రద్ధ డయాబెటిక్ కేర్ సెంటర్ సీనియర్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ బి.శ్రీహరికృష్ణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మధుమేహ వ్యాధిపై అవగాహన– రకాలు– నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీహరికృష్ణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న దీర్ఘకాలిక వ్యాధి మధుమేహమని, ఈ వ్యాధి నియంత్రణలోకి రాని పక్షంలో గుండె, కిడ్నీలు, కాళ్లు, నరాలు వంటి ప్రధాన అవయవాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని హెచ్చరించారు. వ్యాధికి గురైన వ్యక్తి తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి రావడంతో పాటు విపరీతమైన దాహం, ఆకలి ఎక్కువగా వేయడం, అలసట, కంటి చూపు మసక బారడం, గాయాలు మానకపోవడం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. ప్రణాళికాబద్ధమైన జీవనశైలిని పాటిస్తూ, పలు చిట్కాలను పాటించడం ద్వారా మధుమేహాన్ని నివారించవచ్చునని తెలిపారు. తక్కువ కేలరీలు, చక్కెరస్థాయి కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ప్రతి రోజూ కనీసం అరగంట సేపు వ్యాయామం చేయాలని సూచించారు. అధిక బరువు వలయ డయాబెటీస్‌కు గురయ్యే అవకాశముందని, రక్తంలో చక్కెర స్థాయిని తెలుసుకోవడం, క్రమబద్ధంగా వైద్యుని పర్యవేక్షణలో రోగి ఔషధాలను వాడటం వలన ముప్పు నుంచి బయటపడవచ్చునని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర ఎస్వీ రమణ మాట్లాడుతూ మధుమేహం అనేది ఆధునిక కాలంలో ఒక వ్యాధిగా పరిగణించాల్సిన అవసరం లేదని, సక్రమ జీవన విధానంతో దీని నుంచి బయటపడగలమన్నారు. ప్రపంచ డయాబెటీస్ దినోత్సవం సందర్భంగా ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత. అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, ఎస్. మణికంఠ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీహరికృష్ణ

పేదలకు ఇళ్ల స్థలాల కోసం దశలవారీ పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. కొత్తపేటలోని స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో పార్టీ నగర సమితి సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రస్తుత కూటమి అధికారంలోకి వస్తే నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇస్తామని వాగ్దానం చేసినట్లు గుర్తు చేశారు. ఈనెల 18వ తేదీన స్థానిక సచివాలయాల్లో ఇళ్ల స్థలాల అర్జీలు అధికారులకు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు


అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ దేవాలయంలో అమ్మవార్లకు 216 చీరలతో అలంకరణ


ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో రామలింగేశ్వర స్వామికి విశేష అభిషేకార్చనలు


బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు


దత్తపీఠం శ్రీగంగా, పార్వతి సమేత శ్రీరమలినేశ్వరస్వామికి విశేష అభిషేకార్చనలు

కార్తిక పౌర్ణమి శుక్రవారం సత్యనారాయణ వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామిలో సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ దేవాలయంలో అమ్మవార్లకు 216 చీరలతో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సోమసుందరేశ్వరస్వామి ఆలయం, స్థానిక పట్టాభిపురం దత్తపీఠం శ్రీగంగా, పార్వతి సమేత శ్రీరమలినేశ్వరస్వామికి విశేష అభిషేకార్చనలు నిర్వహించారు.

- నగరంపాలెం